

మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆహ్వానపత్రం అందజేస్తున్న కేపీ.నర్సింగ్‌రావు తదితరులు

20న దసరా మిలాప్

బర్కత్‌పుర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరుంధతీయ బంధు సేవా మండలి ఆధ్వర్యంలో ఈనెల 20న దసరా మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి ఆహ్వానపత్రం అందజేసినట్లు బంధు సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ.నర్సింగ్‌రావు, సెక్రటరీ జనరల్ జీబీఎస్.కృష్ణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.నర్సింగ్‌రావు, జి.పవన్‌కుమార్ తెలిపారు. కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

22 మంది ఉపాధ్యాయుల నియామకం

ముషీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని మండలం-1, మండలం-2 పరిధిలో నూతనంగా 22మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారని విద్యామండలి డిప్యూటీ ఈవో చిరంజీవి గురువారం తెలిపారు. ఉన్నత పాఠశాలలో ఐదుగురు, మండలం-1 పరిధిలోని ప్రాథమిక పాఠశాలలకు 9 మంది, మడలం-2 పరిధిలోని ప్రాథమిక పాఠశాలకు 8 మంది ఉపాధ్యాయులు నియమితులైజూట్లు చిరంజీవి పేర్కొన్నారు.

చిక్కడపల్లి వెంకన్న గుడి హుండీ ఆదాయం రూ.24.80 లక్షలు

చిక్కడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని ప్రముఖ శ్రీ వేంకటేశ్వరాలయం 108రోజుల హుండీ ఆదాయం రూ.24,80,245 వచ్చింది.వీటిలో రూ.24,00,348 కరెన్సీరూపంలో, రూ.78,897 కాయిన్స్, యుఎస్ డాలర్స్ 132, ఆస్ట్రేలియా డాలర్స్ 5 వచ్చాయని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్ గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో దేవాలయ సిబ్బంది, భక్తులు, చిక్కడపల్లి యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

హెబ్రోను చర్చి సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి

చిక్కడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోను చర్చి విషయంలో పోలీసులు సరైన విచారణ చేసి తమ చర్చి సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలని చర్చి మాజీ ప్రధానకార్యదర్శి రాగి వీరాచారి కోరారు. గురువారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వారు, పోలీసులు సరైన విచారణ చేసి తమ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎంఎంటీఎస్ రైలులో గుర్తుతెలియని మహిళ మృతి



గుర్తుతెలియని మహిళ మృతదేహం

బర్కత్‌పుర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలులో గుండె పోటుతో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. 40 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మహిళ లింగంపల్లి - ఫలక్‌నామాకు వెళ్లే ఎంఎంటీఎస్ రైలు ఎక్కింది. ఫలక్‌నామా రైల్వేస్టేషన్‌లో ఆగిన సమయంలో ఆ మహిళకు గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తోటి ప్రయాణికులు చూసి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. 108 సర్వీస్‌ను రప్పించగా అప్పటికే ఆ మహిళ మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాతకక్షలతో బైకు దహనం

అంబర్‌పేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో బైకును దహనం చేసిన సంఘటన అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివాసముండే అరుణ్‌కుమార్, అభిషేక్, జాకబ్ ముగ్గురు డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తారు. మద్యం సేవించే అలవాటు ఉన్న వీరికి మనస్పర్థలు తలెత్తాయి. దీంతో వారు ఒకరి మీద ఒకరు ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అభిషేక్, జాకబ్‌లు అరుణ్ కుమార్ ఇంటికి వెళ్లి అతని ఎలక్ట్రిక్ బైక్‌పై పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఈ మంటలు చెలరేగి పక్కనే ఉన్న మరో యాక్టివా వాహనం కూడా కాలిపోయింది. దీనిపై అరుణ్ కుమార్ గురువారం అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్సై మౌనిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొమురంభీం సేవలు మరువలేనివి

ఆయన ఆశయసాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నేటి యువత పాటుపడాలి : వక్తలు



ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సర్వేశ్వర్‌రెడ్డి, వివేక్ వినాయక్, డాక్టర్ హెచ్‌కే.నాగు తదితరులు

కవాడిగూడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జల్‌జమీన్, జంగల్ హక్కుల సాధన కోసం కొమురంభీం ఎంతో కృషిచేశారని, ఆయన ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బ్రిటీష్, నిజాం పాలకులతో పోరాటంచేసిన మహనీయుడు కొమురంభీం అన్నారు. గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొమురంభీం వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డి, తెలుగు సినీనిర్మాత, దర్శకులు అల్లాణి శ్రీధర్, గిరిజన ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ హెచ్‌కే.నాగు, ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ వివేక్‌వినాయక్, అధ్యక్షులు సిందం అర్జున్, కిషన్, ప్రధానకార్యదర్శి సోయం ప్రభాకర్, సోయం గోవర్దన్, రాష్ట్ర నాయకలు గోవర్ధన్‌తోపాటు గిరిజన సంఘాల నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొమురంభీం అని, ఆదివాసీ, గిరిజన వాసులకు జల్ జమీన్ జంగల్‌పై హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేశారని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోందని అన్నారు. అందుకోసమే కోమరంభీం జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. అనంతరం డాక్టర్ హెచ్‌కే.నాగు. వివేక్‌వినాయక్ మాట్లాడుతూ ఆదీవాసీ బంధు అమలు చేయాలని, కొమురంభీంకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజనులకు న్యాయమైన హక్కులను అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని వారు ఆరోపించారు. ఎస్టీ కమిషన్‌ను తక్షణ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజనులకు ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, గిరిజన కళాకారులకు ప్రభుత్వం ద్వారా అన్ని సదుపాయాలు కల్పించి గిరిజన నృత్యాలను పరిరక్షించాలని వారు కోరారు. అదిలాబాద్ జిల్లాకు కొమురంభీం జిల్లాగా, విశాఖపట్నం జిల్లాకు అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణం చేయాలని వారు డిమాండ్ చేశారు.

కళాధర్‌నగర్‌లో అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలి



ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న వెల్ఫేర్ ప్రతినిధులు

ముషీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని కళాధర్‌నగర్‌లో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలని కళాధర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రాపాలికి వినతిపత్రం అందజేశామన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టు వాసు మాట్లాడుతూ... కళాధర్‌నగర్ పార్కు సమీపంలో ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా భవననిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, కాలనీ లేఔట్‌కు విరుద్ధంగా పనులు చేపట్టడం వల్ల స్థానికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ విషయాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులు అక్రమకట్టడాన్ని కూల్చివేయాలని కోరారు.

సివిల్ సప్లై సర్కిల్-6 కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన సివిల్ సప్లై 6వ సర్కిల్ నూతన కమిటీ సభ్యులు

రాంనగర్ , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సివిల్‌సప్లై హైదరాబాద్ సర్కిల్-6 అంబర్‌పేట డివిజన్ రేషన్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం రాంనగర్‌లోని ఎస్సార్టీ కమ్యూనిటీ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేసింది. కమిటీ నూతన అధ్యక్షుడిగా బ్యారం కుమార్, ప్రధానకార్యదర్శి వాడకట్టు రాజు, కోశాధికారిగా మహ్మద్ మోనుజ్జామాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.మహేందర్‌రాజు, సలహాదారులుగా సీహెచ్. గౌరయ్య, ఎ.అప్పారావు. న్యాయసలహాదారులుగా వనం రమేష్, ఉపాధ్యక్షులుగా ఎం.జనార్దన్, కేఆర్‌కే.ప్రసాద్, కె.తిరుపతి, ఎర్రం శ్రీనివాస్, మీడియాకార్యదర్శిగా కె.విజాయనంద్, సంయుక్త కార్యదర్శులుగా సి.శ్రావణ్‌కుమార్, ఎన్‌బీ.చారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.వేణు కార్యవర్గసభ్యులు కె.పరిమల్‌కుమార్, సాయనవీన్, టి.శశికళ, అలివేలు మంగ ప్రమాణ స్వీకరాం చేశారు. ఈ కార్యక్రమానికి రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాయకోటి రాజు, సంజీవ్ రెడ్డి, జాతీయ అధ్యక్షులు కాచం కృష్ణమూర్తి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వైకుంటం, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్‌గౌడ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు జక్కారెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పుస్తె శ్రీకాంత్, రాష్ట్ర మీడియా కార్యదర్శి మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నాయకోటి రాజు మాట్లాడుతూ నవంబర్ 26న రేషన్ డీలర్ల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.



బాల్‌రాజ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మధుయాష్కీగౌడ్

బీసీలు నైపుణ్యాన్ని చాటాలి

చిక్కడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలు అన్నిరంగాల్లో నైపుణ్యాన్ని చాటాలని, ముఖ్యంగా రాజకీయాల్లో మరింత ముందుకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ పిలుపునిచ్చారు. ఆదర్శ స్వచ్ఛందసంస్థ ఛైర్మన్ వంగాల బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు గురువారం మధుయాష్కీగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. మధుయాష్కీగౌడ్ బాల్‌రాజ్‌గౌడ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ రహితంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం: ఎండీ అశోక్



బాగ్‌లింగంపల్లిలో డ్రైనేజీ శుద్ధి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ తదితరులు

రాంనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా జలమండలి చేపట్టిన 90 రోజుల సివరేజీ శుద్ధి కార్యాచరణ కార్యక్రమం ద్వారా డ్రైనేజీ రహితంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. గురువారం చిలకలగూడ జలమండలి సబ్ డివిజన్ పరిధిలోని బాగ్‌లింగంపల్లి సెక్షన్ పరిధిలో మూన్ కేఫ్ చౌరస్తా ప్రాంతంలో స్థానిక సెక్షన్ మేనేజర్ జీవనజ్యోతి ఆధ్వర్యంలో చేపట్టిన డ్రైనేజీశుద్ధి కార్యక్రమాన్ని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, నారాయణగూడ డివిజన్ మేనేజర్ రామకృష్ణ, చిలకలగూడ మేనేజర్ మోహన్‌రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి తద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చేయాలన్నారు. ఇందుకు 90 రోజుల డ్రైనేజీశుద్ధి కార్యక్రమం ఫలితం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి సెక్షన్ పరిధిలో జీఎం, డీజీఎం, మేనేజర్లు ప్రతిరోజు తమ ప్రాంతంలోని కాలనీ, బస్తీలో పర్యటించి స్థానిక డ్రైనేజీ సమస్యల నివారణ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి సెక్షన్‌లో కొనసాగుతున్న డ్రైనేజీశుద్ధి కార్యక్రమంపై ప్రజలస్పందన తీసుకున్నారు. మేనేజర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటస్వామి, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా డ్రాఫ్ట్ విడుదల

అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయండి : డీఎంసీ మారుతీ దివాకర్



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్

రాంనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఈనెల 29న ఓటరు జాబితాను విడుదల చేస్తుందని ఈ నేపథ్యంలో అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్ సూచించారు. గురువారం ఓటరు జాబితాకు సంబంధించి సర్కిల్ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి నవంబర్ 29 వరకు ఓటరు జాబితాలోని తప్పులు, ఇతర అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చే సంవత్సరం జనవరిలో తుది జాబితా విడుదలవులతుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యంగా ఉన్న పోలింగ్ సెంటర్లను మార్చాలని డీఎంసీని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా బోధనలు అనుసరణీయం

కవాడిగూడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబా బోధనలు అనుసరణీయమని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎం.నాగేష్ ముదిరాజ్ భక్తులకు సూచించారు. షిరిడీ సాయినాథుడి 106 మహాసమాధి ఉత్సవాల్లో భాగంగా సాయి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కవాడిగూడలో సాయినాథుడికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్.మహేష్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

చండీహోమం

నల్లకుంట, ఆంధ్రజ్యోతి: అంబర్‌పేట దేవస్థానం సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి రోజు పురస్కరించుకుని అంబర్‌పేట శ్రీమహంకాళి ఆలయంలో జరిగిన చండీ హోమంలో మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణస్వామి దంపతులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం

- అప్రమత్తమైన వాహనదారుడు
- తప్పిన ప్రమాదం



లోయర్ ట్యాంక్‌బండ్‌లో రామకృష్ణ మఠం వద్ద దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

కవాడిగూడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం వద్ద ఓ ద్విచక్రవాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ సంఘటనలో వాహనదారుడు అప్రమత్తమై వాహనాన్ని పక్కకు ఆపి దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఈ సంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలో జరిగింది. దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన పుల్లెల వెంకట మహేష్(36) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఎప్పటిలాగే విద్యానగర్ నుంచి గురువారం ఉదయం తన పల్సర్ 150సీసీ వాహనంపై బయలుదేరాడు. విద్యానగర్ మీదుగా స్టీల్ బ్రిడ్జిపై నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వెళుతున్నాడు. ట్రాఫిక్ జామ్ కావడంతో నెమ్మదిగా రామకృష్ణ మఠం వద్దకు రాగానే తన పల్సర్ బైక్‌లో మంటలు వచ్చే విషయాన్ని గమనించాడు. వెంటనే ద్విచక్రవాహనాన్ని పక్కకు ఆపేసి దిగి దూరంగా వెళ్లాడు. ద్విచక్రవాహనం పూర్తిగా కాలిపోయింది. వెంటనే సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు కేసును దోమలగూడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రావులపాటి మోజెస్‌కు సత్కారం



బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన రావులపాటి మోజెస్‌ను కొణిదల యువసేన ఆర్టీసీ క్రాస్ రోడ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజు, ఇబ్రహీం, చారి తదితరులు పాల్గొన్నారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి.

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా బీజేపీతోనే సాధ్యం



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎం.భాగ్యలక్ష్మి

బర్కత్‌పుర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా బీజేపీతోనే సాధ్యమవుతుందని ఓబీసీ సెంట్రల్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని గురువారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీ మహిళలకు సబ్‌కోటా విధిస్తే దేశంలోని మహిళలకు న్యాయం జరుగుతుందని, ప్రధాని మోదీకి రుణపడి ఉంటారని అన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని ఆమె కిషన్‌రెడ్డిని కోరారు.

పార్టీలో అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు : కేటీఆర్



కేటీఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రాంనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సీనియర్ నాయకులు గురువారం కేటీఆర్‌ను కలిసి పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారికి సరైన న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ వారు చేసిన సర్వీసులను బట్టి గుర్తింపు ఉంటుందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కార్యకర్తల బలం వల్ల పార్టీ పటిష్టంగా ఉందని, రెండుసార్లు ఎమ్మెల్యేగా ముఠా గోపాల్‌ను గెలిపించి జెండా ఎగురవేశారని అన్నారు. ఎవరు కూడా అసంతృప్తి చెందవద్దని కార్యకర్తలకు తాను భరోసాగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాల్వ గోపి, అజయ్ ముదిరాజ్, జోగేందర్, సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, రమేష్, బాల్‌రాజ్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్, ఆటోశ్రీనివాస్, సదా, శివ, మధు తదితరులు పాల్గొన్నారు.

● గోల్నాక: తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి పోలే నిరంజన్ మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలను విన్నవించారు. కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని కేటీఆర్ నిరంజన్‌కు భరోసా ఇచ్చారు.

వరద కాలువకు రిటైనింగ్ వాల్ నిర్మించాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పటేల్‌నగర్‌లో వరద కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంబర్‌పేట డివిజన్ ప్రజలకు వరద నీటి ముప్పు రాకుండా పటేల్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం వెనుక భాగంలోని వరద కాలువకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పటేల్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్‌నగర్ వరద కాలువను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతి దివాకర్, అధికారులు ప్రశాంతి, బీఆర్ఎస్ నాయకులు పడకంటి బ్రహ్మచారి, మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ప్రమోషన్లలో అన్యాయం

సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలి

- ఎస్‌జీటీ ఇంగ్లిష్ టీచర్ శ్రీనివాస్

నల్లకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆసిఫ్‌నగర్‌లోని సీసీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న తనకు ప్రమోషన్ కల్పించడంలో అన్యాయం జరిగిందని, సరైన న్యాయం చేయాలని బాధితుడు బూర శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ రోస్టర్ పాయింట్‌లో తనకు రావాల్సిన ప్రమోషన్‌లో అక్రమం జరిగిందని ఆయన ఆరోపించారు. ఇందులో కుట్ర చేసిన సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తనకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ విషయంలో ఉన్నతాధికారులు తీవ్ర అన్యాయం చేశారని వాపోయారు. తన ప్రమోషన్ విషయంలో హైకోర్టును ఆశ్రయించానని, కోర్టు పదోన్నతి కల్పించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిందని గుర్తు చేశారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా



బాపూజీనగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకుని ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్, ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. గురువారం ఏవీఎస్ అడికమెట్, బౌద్ధనగర్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... ఇంటర్నేషనల్ వాసవీ ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చెందిన మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఉన్నత విద్య అభ్యసించేందుకు స్కాలర్‌షిప్‌లతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్షులు బి.రవి కుమార్ గుప్తా, ప్రధానకార్యదర్శి ప్రభాకర్ గుప్తా, కోశాధికారి శ్రీనివాస్ గుప్తా, ఐవీఎఫ్ పద్మారావు నగర్ అధ్యక్షుడు ప్రసాద్ గోపీ, ప్రాజెక్టు ఛైర్మన్ వెంకటేశ్వర్‌రావు, రాష్ట్రకార్యదర్శి సుధాకర్ గుప్తా, ఐవీఎఫ్ సీనియర్ నాయకుడు లింగంగుప్తా తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి రచనలు నేటి తరానికి ఆదర్శం

డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ విష్ణుప్రియ



మాట్లాడుతున్న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ విష్ణుప్రియ

రాంనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి సంస్కృతంలో రాసిన రచనలు నేటి తరానికి ఆదర్శమని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ విష్ణుప్రియ పేర్కొన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి విష్ణుప్రియ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థకు చెందిన ప్రముఖ అధికారులు, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
అంజిరెడ్డి : 99859 21362